# భ్రమ

లక్ష్మీశ్రీనివాసన్

**ఆ గెస్ట్‌హౌస్** మెయిన్ గేటుముందు నిలబడి ఎదురింటివైపు చూస్తున్నాడు సత్యారావు. సుమారు గంటవుతున్నా ఆ ఎదురింట్లో కెళ్ళిన ప్రకాష్ గుప్తాగారింకా బయటకు రాలేదు. అయినా సహనంతో అలా నిలువుకాళ్ళమీద ఉండి ఆ ఎదురింటి వైపే దృష్టి కేంద్రీకరించా డతను.

ఆరోజు తప్పనిసరిగా ప్రకాష్ గుప్తా గారికి తనుంటున్న ఇల్లు చూపించి, తన అనుమానం నిజమో కాదో తేల్చుకోవాలన్న కృత నిశ్చయంతో ఉన్నా డతను. తనే వెళ్ళి ఏ వాస్తు పండితుణ్ణో తీసుకు రావాలనుకుంటున్న తరుణంలో అనుకోకుండా ఆ ఎదురింటికి వచ్చారు ప్రకాష్ గుప్తాగారు. ఆయ నో వాస్తు—జ్యోతిష పండితుడని ఆ పట్నంలో చాలామంది చెప్పుకుంటారు. ఇంతకు ముందు వాస్తు-జ్యోతిషాలమీదా, మంత్ర తంత్ర యంత్రాలమీదా అంతగా నమ్మకం లేని సత్యారావుకు ఈ మధ్య అటువంటి వాటిమీద అపరిమితమైన నమ్మకం కుదిరిపోయింది.

ఆ ఇంట్లోకి వచ్చినప్పట్నుంచీ కుటుంబంలో ఎవరో ఒకరు ఏదో రోగంతో పీడించబడడం...ఏ పని తలపెట్టినా పూర్తవకపోవడం...ఆర్థికమైన ఇబ్బందులు ఎక్కువ కావడం...అంతకు మించి అనుకోని ఖర్చులు వచ్చి పడుతుండడంతో విసిగిపోతున్న సత్యారావుకు ఇదంతా తనుంటున్న ఇంటి ప్రభావమే అన్న అనుమానం మొలకెత్తి, అదో మహా వృక్షంలా పెరిగిపోయింది. ఆ ఇల్లు వదిలి పెట్టాలని ఎప్పటి కప్పుడు అనుకుంటున్నా, ఆ ఇంటికి అద్దె ఇవ్వాల్సిన అవసరం లేనందువల్ల తన ఆలోచనను ఆచరణలో పెట్టలేక పోతున్నాడు. అదీగాక అతడు చేస్తున్న ఉద్యోగానికి, ఆ ఇంటికి అవినాభావ సంబంధ ముంది.

సత్యారావు పనిచేస్తున్న దో ప్రైవేట్ కం... మొత్తం ఆరు యూనిట్లతో, వెయ్యిమంది వ... రితో కళకళలాడుతూ పని చేయాల్సిన ఆ కంపె... వాటాదార్ల మధ్య తలెత్తిన గొడవల కారణంగా ఒక యూనిట్ మాత్రమే పూర్తయి పని చేస్తోంది. మిగిలిన యూనిట్లు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. ఆ కంపెనీ తమ ఆఫీసు వ్యవహారాలు చూసుకోవటానికి గాను సొంత బిల్డింగ్ అంటూ లేకపోవడంవల్ల ఓ గెస్ట్‌హౌస్‌ను అద్దెకు తీసుకొని, దాని వెనుక ఉన్న చిన్న ఇంట్లో సత్యారావు కుటుంబంతో ఉండే ఏర్పాటు చేసింది. ఆ గెస్ట్‌హౌస్‌కి ఇన్-ఛార్జి సత్యారావు.

అన్ని కటింగులూ పోను అతడి చేతికొచ్చే జీతం ఆరు వందలు. దాంతోనే ఏడుగురు సభ్యులున్న తన కుటుంబాన్ని ఈడ్చుకు రావా లతను. ఏదో తనకు కాస్త చేదోడు వాదోడుగా ఉంటాడని టెన్త్ పాసైన కొడుక్కి ఉద్యోగంకోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. అయితే ఆ ప్రయత్నం ఫలించే సూచన లెక్కడా కనిపించడం లేదు. చాలీ చాలని ఆదాయం అతడిలో తీవ్రమైన అసంతృప్తిని కలిగిస్తూ, ఎన్నో అనుమానాల్ని...తన మీద తనకే అపనమ్మకాన్ని పెంచుతోంది.

అత డలా ఓర్పుగా ఎదురు చూసిన మరో అరగంటకు ఆ ఎదురింట్లోంచి ప్రకాష్ గుప్తాగారు



బయిటకు వచ్చారు. గబగబా వెళ్ళి నమస్కారం చేసి, తనను తాను పరిచయం చేసుకొని ఆయనను లోపలకు ఆహ్వానించాడు సత్యారావు. అతడి ఆహ్వానాన్ని మన్నిస్తూ ప్రకాష్ గుప్తాగారు ఇంట్లోకి అడుగు పెట్టారు. అంతకు ముందే సిద్ధం చేసి ఉంచిన లేత కొబ్బరి నీళ్ళాయన కరకమలాలకు అందించాడతను.

ఆ నీరు గొంతు దిగీ దిగకముందే ఆయన గొంతు గంభీరంగా ధ్వనించింది—"నువ్వీ ఇల్లు ఎంత తొందరగా ఖాళీ చేస్తే అంత మంచిది..."

ఉలిక్కిపడ్డాడు సత్యారావు. అతని గుండెలో దడ ప్రారంభమైంది.

"ఏమిటి...ఏమిటిది? దేవు డుండాల్సిన చోట బాత్రూమ్...పడుకోవాల్సిన చోట వంటగది...వంట చేసుకోవాల్సిన చోట లెట్రిన్...భేష్...బాగుంది...చాలా బాగుంది..." ఆయన ఇల్లంతా తిరుగుతూ ఒకటొకటీ చెబుతూంటే అదిరే గుండెతో, పాలిపోయిన మొహంతో ఆయన వక్కనే నడుస్తున్నాడు సత్యారావు.

"అసలీ ఇంట్లో నీకు నిద్రపడుతోందా?" అడిగారు గుప్తాగారు.

పడుతుందనో, లేదనో మొత్తానికి తలూపాడు సత్యారావు.

"నీకు నిద్ర పట్టదు. ఆ విషయం నాకు తెలుసు-నాకెలా తెలిసిందని నువ్వడక్కు...నీకు అప్పుడప్పుడూ పీడ కలలు కూడా వస్తూంటాయ్...ఔనా?" నిమితంగా ఓ చోట కూర్చుని తీక్ష్ణంగా అతడి మొహంలోకి చూస్తూ అన్నారు గుప్తాగారు.


కాదనలేదు సత్యారావు. అతడికి నిజంగానే అప్పుడప్పుడూ ఏట్లో పడి కొట్టుకు పోతున్నట్టూ...దయ్యాలు మీద పడి పీక్కు తింటున్నట్టూ...ఇలాంటి కలలు వస్తుంటాయి. తనకు కలలు రావడం మాటెలా ఉన్నా, ఆ విషయం ప్రకాష్ గుప్తాగారికెలా తెలిసిందో సత్యారావు కర్థం కాలేదు. అంతే. అప్పటి కప్పుడు ఆయనఅంటే సత్యారావుకు గొప్ప భక్తిభావం ఏర్పడిపోయింది.

ఆయన కొన్ని క్షణాలపాటు కళ్ళు మూసుకొని తెరిచి—"ఈ ఇంట్లో క్షుద్ర శక్తులు సంచరిస్తూంటాయ్! ఇక్కడ మట్టి తవ్వితే మనుషుల ఎముకలు బయట పడతాయ్!! నువ్వు కావాలంటే తీసి చూపిస్తాను నేను..." అన్నారు దృఢంగా.

సత్యారావులో సన్నని వణకు ప్రారంభమైంది.

గుప్తాగారు కాస్సేపు మౌనంగా ఉండి, సత్యారావు జన్మ నక్షత్రం ఏమిటో చెప్పమన్నారు. గుర్తు లేదన్నాడు సత్యారావు. ఆయన అతడి పేరు బలాన్ని బట్టి ఏదో గుణించి, "నువ్వీ ఇంట్లో ఉండటంవల్ల ఇంకా ఇంకా దిగజారిపోతావు. ఇప్పటికే నీ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. నీ గ్రహస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. మనసులో అశాంతి, ఆందోళన, మాటి మాటికీ రోగాలూ...రొష్టులూ...ధన వ్యయం...అన్నట్టు ఈ మధ్య నీ క్కూడా చాలా జబ్బుచేసి ఉండాలి...నిజమేనా?"అని అడిగారు.

తను అనుభవిస్తున్న క్షోభనంతా ఆయన కళ్ళకు కట్టినట్టు వివరిస్తూంటే సత్యారావుకు మతి పోయింది. "నిజమేనండీ. గురూగారూ!...మీరు చెప్పింది అక్షరాలా నిజం!...నా కిటీవలే పక్షవాతం వచ్చింది. దాదాపు రెండు నెలల పాటు దాంతో బాధపడి ఉన్నదంతా ఖర్చుచేసి, ఖరీదైన




మందులు వాడి దాన్నుంచి బయటపడ్డాను..." అంటూ తన బాధలన్నీ ఏ ఒక్కటీ వదలకుండా ఆయనతో చెప్పుకున్నాడు సత్యారావు.

గుప్తాగారు చిన్నగా మందహాసం చేసి, "ఇది ఏ పాత సామాన్లో పడేసుకుందుకు కట్టి ఉంటారే తప్ప, మనుష్యు లుండేందుకు కట్టిన ఇల్లులా లేదు. ఇలాంటి ఇంట్లో ఉంటే బాధలు తప్ప మరేం మిగలవు!" అన్నారు. ఎదురుగా ఉన్న గృహస్థుహాసు వైపు పరిశీలనగా చూస్తూ.

"ఔనండి. నే నొచ్చేసరికి ఈ ఇల్లు నానా చెత్తాచెదారాలతో నిండి ఉండి. చూడ్డానికే భయం గొలుపుతూండేది. అద్దె బాధ తప్పుతుందన్న ఆశతో ఇందులో ఉంటున్నాం!" అన్నాడు సత్యారావు.

"మరిప్పు డేం చేస్తానంటావ్?"

"అది తమరే చెప్పాలి. ఇల్లు మారడంవల్ల ఎదురయ్యే ఇబ్బందులు ముందే మీకు మనవి చేసుకున్నాను కద, గురూగారూ!"

"నువ్వీ ఇంట్లో ఉండటం తప్పదనుకుంటే కొన్ని మార్పులు చేసుకోవాలి!" అన్నారు మరోసారి ఇల్లంతా చూసి వచ్చి ప్రకాష్ గుప్తాగారు.

"ఏం చెయ్యా లంటారు?" ఆత్రతగా అడిగాడు సత్యారావు.

ఏం చెయ్యాలో చెప్పారు గుప్తాగారు. ఆయన చెప్పిన ప్రకారం ఆ ఇంటి గుమ్మాల దిశలు మార్చుకోవాలి. అదనంగా రెండు కొత్త కిటికీలు ఏర్పాటు చేసుకోవాలి. లెట్రిన్ అక్కణ్ణుంచి మార్చి కాస్త ఎడంగా కట్టుకోవాలి-ఆ మాటలు వింటూనే నీరుకారిపోయాడు సత్యారావు. ఎందుకంటే—ఆయన చెప్పిన దాంట్లో ఏ ఒక్కటి చెయ్యాలన్నా గృహస్థుహాసు సొంతదార్ల అనుమతి తీసుకోవాలి. తనకోసం ఆ మార్పులు చెయ్యాల్సిన అవసరం వాళ్ళకు లేదు. మార్పులు చేసుకోడాని కనుమతించినా, అందుకయే ఖర్చు తమ కంపెనీనే భరించమంటారు. అసలే నష్టాల్లో నడుస్తుందని డి.ఎ., ఇతర అలవెన్సులూ ఇవ్వని కంపెనీ ఇలాంటి మార్పులు చెయ్యడానికి ఎంతమాత్రం అంగీకరించదు. "అలా కాకుండా మరో మార్గం ఏదైనా ఉంటే చెప్పండి!" అన్నాడు దిగులుగా సత్యారావు.

"ఏం చెయ్యడానికీ నీకు గ్రహానుకూలత కూడా లేదు" అని ఓమారు గాఢంగా నిట్టూర్చి, "సరే, ముందు గ్రహశాంతి చేయించుకొని, ఆ తర్వాత ఇంట్లో యంత్రం వేయించుకో...దాంతో నీ పరిస్థితుల్లో కొంత మార్పు వస్తుంది. క్షుద్ర శక్తులు ఈ ఇంటి ఛాయలకు కూడా రావు. నువ్వు ఆలోచించుకొని నన్ను కలునుకో. నాకు మరోచోట కొంచెం పనుంది..." అంటూ పైకి లేచారు ప్రకాష్ గుప్తాగారు.

ఆయన్ని అల్లంత దూరం సాగనంపి తిరిగివచ్చి గృహస్థుహాసు ముందున్న గార్డెన్‌లో కూర్చున్నాడు సత్యారావు. చల్లని గాలి వీస్తున్నా ఆలోచనలతో అతడి మెదడు వేడెక్కిపోసాగింది...సరిగ్గా అప్పుడే పిల్లలొచ్చి ఏదో ఫిర్యాదు చెయ్యబోతుంటే వాళ్ళను కసిరికొట్టాడు. భార్య దగ్గరకొచ్చి కూర్చుంటే కళ్ళెర్రజేసి వెళ్ళిపొమ్మన్నట్టు చూశాడు. అతడి కోపమేమిటో తెలియని వాళ్ళంతా బిక్కమొహాలతో అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు. అరగంట గడిచింది...

అప్పుడే ఆఫీసు జీపు తీసుకొచ్చిన సారంగపాణి జీపు గేరేజిలో పెట్టి, గార్డెన్‌లో ఉన్న సత్యారావు దగ్గర కొచ్చి "హలో!" అన్నాడు పలకరింపుగా.


"హలో!...రా, కూర్చో..." అన్నాడు తన ఆలోచనలు వక్కకు నెట్టి సత్యారావు.

"ఏమి టలా ఉన్నా రీవేళ?" అతడి సరసనే కూర్చుంటూ అన్నాడు సారంగపాణి.

"ఏముంది...ఈ ఇల్లు మంచిది కాదని చెబుతూంటే ఇంతవరకూ నా మాట తేలిగ్గా కొట్టిపారేశావు నువ్వు. నేననన్నది అక్షరాలా నిజమైంది. ఈ ఇంట్లో ఉండటం ఎంతమాత్రం మంచిది కాదట..." అంటూ జరిగినదంతా సారంగపాణికి చెప్పాడు సత్యారావు.

"అయితే ఇదంతా మీరు నమ్ముతున్నారన్న మాట?" నవ్వుతూ అడిగాడు సారంగపాణి.

"జరుగుతున్న అనుభవాల్ని బట్టీ ఎదురౌతున్న బాధల్ని బట్టీ నమ్మక తప్పడంలేదు. ఈ ఇంట్లో కొచ్చింది మొదలు ఎన్ని బాధలు పడుతున్నామో నీకు తెలియంది కాదు. ఆయన ప్రతి విషయం కళ్ళతో చూసినట్టు చెప్పారు. ఇల్లు మార్పు గురించి మన ఎమ్.డి. గారిని అడగా




లనుకుంటున్నాను..."

"అనవసరం...ఈ ఇంట్లో ఉండటం ఇష్టం లేకపోతే మరో ఇల్లు చూసుకోమంటారే గాని, మార్పులు చెయ్యడాని కాయన న సేమిరా ఒప్పుకోరు. అది సరే. ఇంట్లో యంత్రం వెయ్యడానికి ఆ గుప్తాగారు ఏం తీసుకుంటా నన్నారు?"

సత్యారావు నాలిక కరచుకొని "ఆ విషయం అడగడం మర్చిపోయాను. రేపు వెళ్ళి అడుగుదాం. నువ్వూ రాకూడదూ?" అన్నాడు.

"దాని కేముంది...అలాగే వస్తాను" అన్నాడు సారంగపాణి.

×× ×× ××

మర్నాడు సాయంత్రం సారంగపాణితో బాటు ప్రకాష్/ గుప్తాగా రింటి కెళ్ళాడు సత్యారావు. అక్కడ ఆడా, మగా ఎంతోమంది జనం...ఆ జనాని కెన్నో రకాల సమస్యలు...వారిలో ఎంతో చదువుకున్న వాళ్ళూ ఉన్నారు-ఏమీ చదువుకోని వాళ్ళూ ఉన్నారు. సత్యారావు నమస్కారాన్ని కళ్ళతోనే స్వీకరించి, కూర్చోమని సూచించారు గుప్తాగారు. సత్యారావూ, సారంగపాణీ ఓ ప్రక్కన కూర్చున్నారు.

"నాకు ఉద్యోగం ఎప్పుడొస్తుం దంటారు?"

"నేను చేస్తున్న వ్యాపారం సరిలేదండి. ఎందుచేత నంటారు?"

"వెధవది-లాటరీ టిక్కెట్టు కొన్నప్పుడల్లా అయిదో, పదో వస్తుందండి. ఒక్కసారే లక్ష రూపాయ లొచ్చే యోగం ఉందంటారా నాకు?"

"మాఅబ్బాయికి పెళ్ళి కావడం లేదండి. కాస్త చూసి చెబుతారా?"

"మా అమ్మాయిని మొగుడొదిలేశాడండి. మీ రెలాగైనా వాళ్ళను కలపాలి!"

"మొన్న మీరు చెప్పినట్టు మాఇంట్లో మార్పులు చేశాం-ఇంకా ఫలితం కనిపించలే దేమిటండి?"

—ఇవన్నీ వింటూ కూర్చున్న సారంగపాణి సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాడు. డాక్టరు రోగానికి మందు రాసిచ్చినట్టు ఆయన అందరికీ అన్నీ చెబుతున్నారు. కొందరు ఎంతిస్తే అంతా తీసుకుంటున్నారు. మరి కొందరికి ఇంతయితే తప్ప ఆ కార్యక్రమం చేసేందుకు వీలు కాదని స్పష్టం చేస్తున్నారు. మొత్తానికి అక్కడ మనుష్యుల అజ్ఞానమూ, బలహీనతా, అత్యాశా గొప్ప వ్యాపారం చేస్తున్నా యనిపించిం దతడికి.

సారంగపాణి అలా అనుకుంటూంటే, సత్యారావు కాయన ఓ దైవాంశ సంభూతులుగానే కనిపించసాగారు. ఇంచుమించు ఓ గంట తర్వాత ఆయనతో మాట్లాడే వీలు చిక్కింది వాళ్ళకు. సారంగపాణిని ఆయనకు పరిచయం చేశాడు సత్యారావు.

"మాసత్యారావుగా రా ఇంట్లో నాలుగు సంవత్సరాల నుంచి ఉంటున్నారు. ఇప్పుడా ఇంట్లో ఉండటం క్షేమం కాదని మీరు చెప్పారట."

"ఔను. వాస్తుకు పూర్తి వ్యతిరేకంగా ఉం దా ఇల్లు. ఆ ఇంట్లో వాళ్ళు క్షేమంగా ఉండాలనుకుంటే నేను చెప్పిన మార్పులైనా చెయ్యాలి. లేదా ఇంట్లో యంత్రమైనా వేయించుకోవాలి. ఇదంతా అతడికి నిన్ననే చెప్పాను. మీరు తొందరగా ఏదో ఒకటి తేల్చి చెప్పండి. అవతల నాకు చాలా పనులున్నాయ్!" అన్నారు సారంగపాణి మాటలు పూర్తి కాకుండానే గుప్తాగారు.

"ఆ విషయమే మాట్లాడాలని వచ్చాం. మీరు వేసే ఆ యంత్రానికి ఎంతవుతుందంటారు?" కాస్త కోపంగా అడిగాడు సారంగపాణి.

"సుమారు ఎనిమిది వంద లవుతుంది!" అన్నారు వెంటనే గుప్తాగారు.

ఆయన చెప్పిన ఎమౌంటు వింటూనే సత్యారావూ, సారంగపాణీ తెల్లబోయారు.

"మీ రిచ్చిన డబ్బుకు తగ్గ ఫలితం వెంటనే కనిపిస్తుంది. తరవాత మీ ఇష్టం!" అన్నారు తన మాటకు తిరుగు లేదన్నట్టు గుప్తాగారు.

"సరే. కొంచెం ఆలోచించుకుని మళ్ళీ కలుస్తాం!" అని వాళ్ళిద్దరూ ఆయన వద్ద సెలవు తీసుకొని బయటకు వచ్చేశారు.

"ఏం చెయ్యదలుచుకున్నారు?" అన్నాడు సారంగపాణి.

"అంత డబ్బు నే నెక్కడ తెచ్చేది? చూస్తే ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్నట్టుంది నా పరిస్థితి!" అన్నాడు దీనంగా, దిగులుగా సత్యారావు.

"ఏమైనా ఈయన చాలా ఎక్కువ అడిగాడేమోనని నా ఉద్దేశం. మీరు తొందర పడకండి. భరతశర్మగారని నాకు తెలిసిన మరొకాయన ఉన్నారు. వీలైతే రేపు ఆయన్నికూడా కలుసుకుని ఆ పైన ఏం చెయ్యాల్సిందీ నిర్ణయించుకుందాం!" అన్నాడు సారంగపాణి.

×××× ××

ఆ మర్నాటి నుంచీ నాలుగు రోజులపాటు గెస్టుహౌసుకు ఎవరో పై అధికారులు రావడం వల్ల క్షణం తీరిక లేకుండా పోయింది సత్యారావుకు.

అయిదో రోజు తీరిక అవడంతో సత్యారావును తీసుకెళ్ళి భరతశర్మగారికి పరిచయం చేశాడు సారంగపాణి. కేవలం నోటి మాటలతోనే కాకుండా సత్యారావు ఉంటున్న ఇంటి ప్లాను ఓ కాగితంమీద గీసి చూపించి, అతడి పరిస్థితుల్ని క్షుణ్ణంగా ఆయనకు తెలియజేశాడు సారంగపాణి.

భరతశర్మగారు చాలా సేపు ఆ ప్లాను పరిశీలించి, "మరేం భయం లేదు! మీకు గృహశాంతీ, గ్రహశాంతీ ఉండేందుకు నే నా ఇంట్లో యంత్రం వేస్తాను" అన్నారు సత్యారావుకు అభయమిస్తూ.

"ఎంతవుతుందంటారు?" గుండె అరచేత్తో పట్టుకుని అడిగాడు సత్యారావు.

"ఇంట్లో యంత్రం వేశాక మీ పరిస్థితి బాగుంటే అప్పుడు మీ సంతోషం కొద్దీ ఎంతో కొంత నా కిద్దురు గాని... యంత్రానికి మాత్రం ఓ వందవుతుంది" అన్నారు భరతశర్మగారు.

"ఫరవాలేదు. మొత్తం ఎంతవుతుందో చెప్పండి!" అన్నాడు సారంగపాణి.

"ఏం చెప్పను? అది నా నియమం! మీ గురించి నా నియమాన్ని మీరలేను" అంటూ కోపంగా వాళ్ళిద్దరి వైపూ చూశారు భరతశర్మగారు.

"సరే, మీ ఇష్టం! అలాగే కానివ్వండి!" అన్నాడు సారంగపాణి.

"అదీ అలా అన్నారు-బాగుంది" అని కొద్దిసేపాగి ఏవో లెఖ్ఖ లేసుకొని "వారం తరవాత సరిగ్గా ఇదే రోజున రాత్రి తొమ్మిదీ పదిహేను నిమిషాలకు మీ ఇంట్లో యంత్రం వేస్తాను" అంటూ ఆ రోజున కావాల్సినవి ఓ కాగితం మీద వ్రాసి సత్యారావు చేతి కిచ్చారు భరతశర్మగారు.

మరేం మాట్లాడకుండా అది తీసుకుని, ఆయనకు నమస్కారం చేసి బయటి కొచ్చేశారు వాళ్ళు. "ఇప్పుడేం లేదని ఆ తరవాత పెద్ద మొత్తం డిమాండ్ చేస్తాడేమో ఈయన?" బయటకు రాగానే తన అనుమానం వెలిబుచ్చాడు సత్యారావు.

"ఈయన మరీ అంత డబ్బు గుంజే మనిషి కాడు. ఆయన మాటల్ని బట్టి ఆ విషయం మనకు స్పష్టంగా తెలుస్తూంది కదా! ఎందుకైనా మంచిది, పెద్ద మొత్తంలో డబ్బడిగితే నాకు తెలియకుండా ఇవ్వకండి!" అన్నాడు సారంగపాణి. ఇద్దరూ మౌనంగా రోడ్డుమీద నడవసాగారు.

"మీ అబ్బాయిని జూట్ మిల్లులో జాయిన్ చేస్తానని చెప్పారు. ఏమైందది?" ఉన్నట్టుండి అడిగాడు సారంగపాణి.

"హై లెవెల్‌లో రికమెండేషన్ ఉంటే తప్ప అదయ్యేటట్టు లేదు. అదేకాదు. ఏ పని తలపెట్టినా అలాగే ఏడుస్తూంది!" అన్నాడు విరక్తిగా సత్యారావు.

"టెన్త్ పాసై అప్పుడే రెండు సంవత్సరాలైనట్టుంది. ఎందుకిలా ఖాళీగా తిరగనివ్వడం? మంచి

సెంటరేదో చూసి ఏ పాన్‌షాపో పెట్టించకూడదూ?"

"దేనికైనా డబ్బుండాలి కదా! వచ్చే ఆరొందలూ ఇంటి అవసరాలకే సరిపోవడం లేదు."

సారంగపాణి వెంటనే మాట్లాడలేదు. సత్యారావు చెప్పింది నిజమే-ఈ రోజుల్లో ఎనమండుగురు సభ్యులున్న కుటుంబానికి ఆరొందలు ఏ మూల? అతను కొంచెం సేపు ఆలోచించి, "ఓ పని చేస్తారా! నేనో ఎనిమిది వందలు అప్పు ఇస్తాను. ఆర్.టి.సి. బస్సు కాంప్లెక్స్ కెదురుగా ఓ ఖాళీ బడ్డీ ఉంది. అది అద్దెకు తీసుకుని మీ వాడి చేత షాపు పెట్టించండి. ఆ అప్పు ఒక్కసారే కాకుండా ఏడెనిమిది వాయిదాల్లో తీర్చేద్దురుకాని" అన్నాడు సారంగపాణి.

అతడు చెప్పినట్టు చేస్తే కొంత బాగుంటుందేమో తన పరిస్థితి అన్న ఆలోచన సత్యారావుకు మొదటిసారిగా కలిగింది. ఆ మాట లతడు నిజంగానే అంటున్నాడా అన్న అనుమానమూ వచ్చింది. అయితే ఎంతో చనువు ఉన్నా సారంగపాణి తనతో ఎప్పుడూ వేళాకోళంగా మాట్లాడలేదు...

"నేను నిజంగానే అంటున్నాను" అన్నాడు సత్యారావు ఆలోచనల్ని గ్రహించినట్టు పాణి.

"నువ్వు చెప్పినట్టు చేద్దాం!" అన్నాడు సారంగపాణివైపు కృతజ్ఞతగా చూస్తూ సత్యారావు.

×××× ×××

అన్న మాట ప్రకారం భరతశర్మగారు సత్యారావు ఇంట్లో అన్న బైముకు ఓ మూల జానెడు లోతు గొయ్యి తవ్వించి, మంత్రోచ్చారణ చేస్తూ యంత్రం వేసి, అతడిచ్చిన వంద రూపాయలు తీసుకొని వెళ్ళిపోయారు.

సరిగ్గా ఆ రోజునే సారంగపాణి సహకారంతో బస్సు కాంప్లెక్స్ దగ్గర పాన్‌షాపు ఓపెన్ చేసి కొడుక్కి అప్పగించాడు సత్యారావు.

×××× ××


అయిదు నెలలు గడిచేసరికి సత్యారావు జీవితంలో అనుకోని మార్పు లొచ్చాయి. అతని కిప్పుడు పీడ కలలు రావడం లేదు. ఏ విషయం గురించీ తీవ్రంగా ఆలోచించడం మానేశాడు. అలవెన్సుల మాటెలా ఉన్నా, ఇటీవలే కంపెనే డి.ఎ. ప్రకటించింది. కొడుకు చూసుకుంటున్న పాన్ షాపు బాగా అమ్ముతూంది. అతను సారంగపాణి ఇప్పించిన అప్పు తీర్చడమేగాక, ఆరు వందలిచ్చి ఆ బడ్డీని సొంతం చేసుకున్నాడు.

ఇంతటికీ మూలకారణమైన భరతశర్మగారంటే సత్యారావుకు అపరిమితమైన భక్తీ, అంతకు మించి అంతులేని నమ్మకమూ ఏర్పడ్డాయి. తన స్థితిగతులు చెప్పుకోవడానికి నెల క్రితం సత్యారావు భరతశర్మ గారింటికి వెళ్ళాడు కాని, ఆయన ఆ రోజు ఇంటి దగ్గర లేరు. మళ్ళీ వెళ్దాం, వెళ్దాం అనుకుంటూండగానే నెల గడిచిపోయింది.

ఆ రోజు సాయంత్రం కొంత డబ్బు తీసుకుని సారంగపాణితోబాటు భరతశర్మగారింటికి వెళ్ళాడు మళ్ళీ సత్యారావు. అదృష్టవశాత్తు ఆయన ఇంటి దగ్గరే ఉన్నా రా రోజు.

వాళ్ళను కూర్చోమని, కుశల ప్రశ్నల తర్వాత "నీ పరిస్థితి ఎలా ఉందిప్పుడు?" అన్నారు సత్యారావును చూస్తూ భరతశర్మగారు.

"మీ దయవల్ల నా పరిస్థితి బాగుంది. తమకు ఎక్కువగా ఇచ్చుకోలేకపోయినా ఏదో







'చంద్రుని కో నూలుపోగు' రీతి ఈ మూడొందలూ తమరు తీసుకోవాలి..." అంటూ డబ్బు ఇవ్వబోయాడు సత్యారావు.

ఆయ నా డబ్బు తీసుకోకుండా చిన్నగా నవ్వి, "ఈ డబ్బుకు మరికొంత జత చేసి మీ పాన్‌షాపుకు సోడా మెషిన్ కొనుక్కోండి! మీ వాణ్ణి ఆ వ్యాపారంలోనే ఉండనివ్వండి" అన్నారు.

"అలా అంటే కాదు. నా తృప్తి కోసమైనా ఇదుంచాలి మీరు" అన్నాడు సత్యారావు.

"అయితే ఆ డబ్బు నా క్కాదు. సారంగపాణి కివ్వండి!" అంటూ సారంగపాణి వైపు చూసి నవ్వసాగా రాయన. అంతవరకూ నవ్వాపుకుంటున్న సారంగపాణికూడా ఇక నవ్వకుండా ఉండలేకపోయాడు.

వాళ్ళెందుకు నవ్వుతున్నారో సత్యారావు కేం అర్థం కాలేదు.

"మీ కంతా అయోమయంగా ఉన్నట్టుంది. అసలు జరిగిన దేమిటో చెబుతాను-వినండి. సారంగపాణి నాకు మంచి మిత్రుడు. మీ రిద్దరూ ప్రకాష్ గుప్తాగారిని కలుసుకున్న మర్నాడు అతను నా దగ్గర కొచ్చి మీ పరిస్థితి సవిస్తరంగా చెప్పాడు. అతడు చెప్పిన దాన్నిబట్టి ప్రకాష్ గుప్తాగారు చాలా మటుకు మిమ్మల్ని ప్రశ్నించి మీ ద్వారానే జవాబులు రాబట్టారని నా కర్థమైంది. ఒక విధంగా ఆయన మిమ్మల్ని భయపెట్టడంకూడా జరిగింది. మంచివో, చెడ్డవో కలలనేవి ప్రతి మనిషికీ వస్తూనే ఉంటాయి. అలాగే బాధలుకూడా ప్రతి మనిషినీ వెన్నంటే ఉంటాయి. ఎటొచ్చీ అవి తట్టుకోలేని బలహీనతకు మనిషి గురైనప్పుడు మనస్సు చెదిరి అనేక ఆలోచనల్ని కలిగిస్తూ. అప్పుడేం చెయ్యాలో తెలియని అయోమయంలో పడేస్తుంది.

"అంతమాత్రానికే వాస్తు, జ్యోతిషశాస్త్రాలు లేవని కాని, వాటిని తూలనాడుతున్నానని కాని మీరు ఎంతమాత్రం భావించవద్దు. అయితే కొందరు వాటిని అడ్డం పెట్టుకుని, మన బలహీనతల్ని ఆధారంగా చేసుకొని డబ్బు గుంజుతున్నారనేది నేను ఖచ్చితంగా చెప్పగలను. మీ గురించి మా ఇద్దరి చర్చలోనూ మీ బాధ లన్నిటికీ ముఖ్య కారణం మీ ఆర్థిక పరిస్థితే నని తేలింది. కొంతలో కొంత మీ రుంటున్న ఇంట్లో దోషం ఉంటే ఉండొచ్చు. కానీ మీరు పూర్తిగా ఆ ఇంట్లో ఉండటం వల్లే ఇన్ని చిక్కు లొస్తున్నాయనే నమ్మకంతో, యంత్ర తంత్రాలవల్ల మీ పరిస్థితుల్లో మార్పొస్తుందనే భ్రమలో ఉన్నారు. మీ భ్రమను, నమ్మకాన్ని కాదనకుండా ఆ విధంగానే మీలో మార్పు తేవాలనీ, దాంతోపాటు మీ ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చాలనీ ఆలోచించి ఈ విధంగా చేశాం.

"కేవలం మిమ్మల్ని భ్రమ పెట్టామే తప్ప మీ రనుకుంటున్నట్టు మీ ఇంట్లో నే నెలాంటి యంత్రం వెయ్యలేదు. యంత్ర తంత్రాలు మనిషి జీవితాన్ని మారుస్తాయో లేదో, మంత్రాలకు చింతకాయలు రాల్తాయో లేదో నిజంగా నాకు తెలియదు. కానీ, ఇలా చేస్తే ఎలా ఉంటుందన్న మా ఊహ మీ కెంతో ధైర్యాన్నిచ్చి, మీ ఆర్థిక పరిస్థితికూడా మెరుగు పడ్డానికి తోడ్పడింది. ఆర్థిక పరిస్థితి బాగుంటే అసలు ఏ మనిషికీ ఇలాంటి భ్రమలూ, నమ్మకాలూ ఉండవేమో... ఇవిగో ఆ రోజు మీరు నా కిచ్చిన వంద రూపాయలు..." అంటూ ఆగాడు భరతశర్మ.

ఆ వందా అందుకుంటూ విస్మయానందాలతో భరతశర్మ, సారంగపాణిల వైపు చూశాడు సత్యారావు.